'కోత'ల కూటమి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 'కోత'లకే పరిమితమైంది. అధికారంలోకి వస్తే ప్రజలను అందలమెక్కిస్తామంటూ చెప్పిన మాటలు నీటిమీద రాతలేనని మరోసారి రుజువు చేస్తోంది. కొలువుదీరిన 50 రోజుల్లోనే రేషన్ పంపిణీలో పంచదార, కందిపప్పుకు కోత పెట్టేసింది. జూలై నెలకు కేవలం బియ్యంతోనే సరిపెట్టేసిన సర్కార్.. ఆగస్టు నెలకు కూడా రేషన్ డీలర్లకు బియ్యం మాత్రమే సరఫరా చేసింది. దీంతో రాయితీ కందిపప్పు, పంచదార సరఫరాకు మంగళం పాడినట్లైంది.


పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంలో ఉన్న బియ్యం బస్తాలు


ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి లారీలో రేషన్ బియ్యం చౌకదుకాణాలకు తరలింపు..

- రాయితీ పంచదార, కందిపప్పుకు మంగళం
- డీలర్లకు ఆగస్టులోనూ కోటా బియ్యం మాత్రమే సరఫరా
- అదే బాటలో ఇంటి వద్దకే రేషన్ కార్యక్రమం
- ప్రశ్నార్థకంగా ఎండీయూ వాహనాల పరిస్థితి
- సత్తెనపల్లి నియోజకవర్గంలో 91,637 మంది కార్డుదారులు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని సత్తెన పట్టణం, రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల పరిధిలో 91,637 రేషన్ కార్డులు ఉన్నాయి. 165 చౌక దుకాణాల ద్వారా ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు బియ్యం, కందిపప్పు, పంచదార పంపిణీ చేయాల్సి ఉంది. ఆగస్టు నెలకు 1,269 టన్నులు బియ్యం మాత్రమే చౌక దుకాణాలకు సరఫరా జరిగింది.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్(ఎండీయూ వాహనాల) ద్వారా ఇంటికే నిత్యావసర సరుకులు డోర్ డెలివరీ చేశారు. కార్డులో ఒక్కో లబ్ధిదారుడికి ఐదు కిలోలు చొప్పున ఉచిత బియ్యంతో పాటు కుటుంబానికి కిలో కందిపప్పు, అర కిలో పంచదార రాయితీ ధరలపై సరఫరా చేశారు. ఇంటికే నిత్యావసర సరుకులు అందడంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు ఆనంద వ్యక్తం చేశారు.

ఎన్నికల ముందు ఎన్డీఏ కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే మరిన్ని నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు అందిస్తామని ప్రచారం చేశారు. తీరా అధికారం చేపట్టిన తొలి నెలలోనే పంచదార, కందిపప్పు పంపిణీకి కోత పెట్టారు. రెండో నెల అయినా పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తారని భావించగా.. మళ్లీ బియ్యంతోనే సరిపెట్టేశారు.

ఎండీయూ వాహనాలకు మంగళం

దారిద్ర్య రేఖకు దిగువనున్న నిరుపేదలకు ఇంటికే రేషన్ పంపిణీలో భాగంగా గత ప్రభుత్వం సత్తెనపల్లి నియోజకవర్గానికి 55 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎండీయూ వాహనాల వల్ల తీవ్ర నష్టం కలుగుతోందని, ఇంటికే రేషన్ పంపిణీ సరైన నిర్ణయం కాదంటూ ఇటీవల విమర్శలు చేశారు. దీంతో ఎండీయూ వాహనాలకు త్వరలో మంగళం పాడనున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న వారి గోడు ఆలకించే నాథుడే లేని పరిస్థితి నెలకొంది.

ఎన్నికల వరకే రాజకీయాలు

- సత్తెనపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందాం
- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ


పట్టణంలోని కౌన్సిల్‌లో అజెండాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కన్నా, పక్కన చైర్ పర్సన్ లక్ష్మీతులసీ


వెనుక వైపు కౌన్సిలర్ల సీట్లలో కూర్చున టీడీపీ శ్రేణులు

సత్తెనపల్లి: ఎన్నికల వరకే రాజకీయాలు .. గెలిచాక అందరితో కలిసి పట్టణ అభివృద్ధిలో పాలు పంచుకుందామని సత్తెనపల్లి శాసనసభ్యుడు కన్నా లక్ష్మీ నారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన ఎక్స్ అఫిషియో సభ్యునిగా హాజరై ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తెనపల్లి అభివృద్ధికి ఏ విషయంలోనైనా తాను సహకరిస్తానని, ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి చేసుకుందామన్నారు. గత ఏడాది నుంచి సత్తెనపల్లి పట్టణంలో తిరుగుతున్నానని, పట్టణంపై తనకు ఒక అవగాహన ఉందన్నారు. అజెండాలో 48 అంశాలను చర్చించి కౌన్సిల్ అభివృద్ధికి ఆమోదించినట్లు చెప్పారు. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా తను చైర్‌పర్సన్ లక్ష్మీ తులసి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయడం ఆనందంగా ఉందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ మాట్లాడుతూ సత్తెనపల్లి శాసనసభ్యుడిగా గెలుపొందిన కన్నా లక్ష్మీనారాయణకు వైఎస్సార్ సీపీ తరపున అభినందనలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్ మాట్లాడుతూ ఎప్పుడో రానున్న 15 ఏళ్ల తర్వాత అభివృద్ధి జరిగే ప్రాంతాలకు ఇప్పుడే కోట్ల రూపాయల నిధులు కేటాయించడం ఎందుకని ప్రశ్నించారు. పట్టణంలోని 11వ వార్డు నుంచి 23వ వార్డు వరకు శాశ్వత ముంపు నుంచి పట్టణాన్ని కాపాడేందుకు స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణానికి నగదు ఖర్చు చేస్తే బాగుంటుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. స్ట్రామ్ వాటర్ డ్రైన్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని, నిర్మాణానికి కూడా చర్యలు చేపడదామన్నారు. 31వ వార్డు కౌన్సిలర్ తురకా మేరిగ్రేస్ మాట్లాడారు. అనంతరం అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. తొలిసారి ఎమ్మెల్యేగా కౌన్సిల్‌కు వచ్చిన ఎమ్మెల్యే కన్నాను సన్మానించారు. అనంతరం మున్సిపల్ కార్మికులకు దుస్తులు, నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. ముందుగా మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీతులసి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు దంపతులు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్సాహం ప్రదర్శించిన టీడీపీ శ్రేణులు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోకి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, అధికారులు, జర్నలిస్టులు హాజరు కావాల్సి ఉంటుంది. కానీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరైన కౌన్సిల్ సమావేశంలో కొందరు టీడీపీ శ్రేణులు అత్యుత్సాహం ప్రదర్శించి, కౌన్సిలర్లకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. అది గమనించిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఒకటికి రెండుసార్లు బయటికి వెళ్లమని చెప్పినప్పటికీ కొందరు టీడీపీ శ్రేణులు ఖాతరు చేయకుండా సీట్లలో కూర్చోవడం గమనార్హం.

నేడే మండల సర్వసభ్య సమావేశం

అమరావతి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షతన నిర్వహిస్తామని ఎంపీడీవో జి.రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పెదకూరపాడు శాసనసభ్యుడు భాష్యం ప్రవీణ్ హాజరు అవుతారని పేర్కొన్నారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తామని అధికారులు తమ శాఖల నివేదికలతో హాజరు కావాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. అలాగే బుధవారం సాయంత్రం మండల పరిధిలోని మునగోడు గ్రామంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తారని అలాగే గ్రామ ప్రజలతో మాట్లాడతారని తెలిపారు.

పాఠశాల కమిటీ ఎన్నికలకు సిద్ధం కావాలి

రాజుపాలెం: మండలంలోని అన్ని పాఠశాలల కమిటీ ఎన్నికల నిర్వాహణకు సిద్ధం కావాలని ఎంఈవో -1 శ్రీనివాసరావు, ఎంఈవో-2 నరసింహ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1న పాఠశాల నోటీసు బోర్డులో ఓటరు లిస్టు ప్రదర్శించాలని, 5న అభ్యంతరాలను స్వీకరించాలని, 8న సభ్యులు స్కూల్ కమిటీ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోవాలని, అనంతరం ప్రమాణ స్వీకారం చేయించాలని తెలిపారు. ప్రమాణ స్వీకారం చేయించి తొలి సమావేశం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

నకరికల్లు: మండలంలోని అన్ని గ్రామాల్లోను గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ డి.జయమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9,573 వివిధ రకాల పెన్షన్‌లకు గాను రూ.4,14,78,500లు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. 138 మంది సిబ్బంది ఇంటింటికి వెళ్లి నగదు అందజేస్తారని తెలిపారు.

నేటి నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ

క్రోసూరు: మండలంలో గురువారం నుంచి ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పింపిణీ జరుగుతుందని ఎంపీడీవో టీవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం వివిధ రకాల పెన్షన్‌దారులు 8,701 మందికి గాను రూ. 3,75,25000లు మంజూరైనట్లు తెలిపారు. గ్రామాల్లో అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేస్తారని తెలిపారు.

రేపటి నుంచి వితంతు పింఛనుపై అవగాహన సదస్సులు

సత్తెనపల్లి: సత్తెనపల్లి కోర్టు పరిధిలోని అన్ని మండలాల్లో వితంతు పింఛన్ పథకంపై ఆగస్టు 2 నుంచి 13వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సులు ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సచివాలయంలో జరుగుతాయన్నారు. ఈ నెల 2న ముప్పాళ్ళ, 3న అచ్చంపేట, 5న క్రోసూ రు, 6న సత్తెనపల్లి పట్టణంలోని 5,6 వార్డులు, 7న సత్తెనపల్లి మండలం నందిగామ, 8న రాజుపాలెం, 9న బెల్లంకొండ, 12న అమరావతి, 13న పెదకూరపాడు గ్రామంలో సదస్సులు జరుగుతాయని తెలిపారు. వితంతు పింఛన్ పథకానికి అర్హత కలిగిన వారు అవగాహన సదస్సులో వివరాలు అందజేయాల్సిందిగా ఆయన తెలిపారు.

గోదాంలో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ



సత్తెనపల్లి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉన్న పౌరసరఫరాల గోదాంను సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. గోదాములో ఉన్న ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన బియ్యం స్టాకును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. చౌక దుకాణాలకు సరఫరా చేసిన వివరాలను పరిశీలించారు. ఆయనతో పాటు పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్ అరుణ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచాలి


పీహెచ్‌సీలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి పి.రమాదేవి, వైద్య సిబ్బంది

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నుంచి ఆగస్టు 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాల్లో బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి పేర్కొన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని తల్లిపాల వారోత్సవాలపై వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది తల్లి పాలు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాల్సి ఉందన్నారు. తల్లిపాలకు ఎటువంటి ప్రత్యామ్నాయం లేదని, ప్రతి బిడ్డకూ తల్లి పాలు అందేలా చేయటం మన సంకల్పమన్నారు. వారోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు ఎ.పీటర్ డేమియన్, ఎం.జోస్పిన్ రాణి, సీనియర్ అసిస్టెంట్ సురేష్, ఏఎన్ఎం.నూర్జహాన్, జైనుల్లా, కరిముల్లా, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

4న అచ్చంపేట సర్వసభ్య సమావేశం

అచ్చంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశం హాలులో ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుసుమకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల పురోగతిపై నివేదికలతో రావాలని పేర్కొన్నారు. మండల పరిషత్, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావలసినదిగా ఆమె తెలిపారు.

సబ్సిడీపై వరి విత్తనాలు పంపిణీ

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై అందించే వరి విత్తనాలను నియోజకవర్గ టీడీపీ నాయకుడు, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు బుధవారం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటిని సద్వినియోగం చేసుకోవాలి



పెదకూరపాడు: భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ నీటిని అవసరం మేరకు వినియోగించుకోవాలని ఎంపీడీవో మల్లేశ్వరి సూచించారు. పెదకూరపాడులో జలశక్తి అభియాన్‌లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటిని అవసరం మేరకు వాడాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏపీఓ కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దాతల సహకారం అవసరం



పెదకూరపాడు: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం అవసరమని నరసరావుపేట నెల్లూరు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ నెల్లూరు రమేష్ అన్నారు. స్థానిక ఎంపీపీఎస్ హెచ్‌డబ్ల్యూ ఎస్ పాఠశాలకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో టీవీ, నోట్ పుస్తకాలు, పెన్నులు, రూ. 15వేలు విలువ చేసే బీరువా అందజేశారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ కరిముల్లా బాబు, బి.వెంకటప్పయ్య, ఉపాధ్యాయులు అనిత, రహంతుల్లా పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ



సత్తెనపల్లి: ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చని ప్యానల్ న్యాయవాది ఆకుల నాగార్జున అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు సూచనల మేరకు ఫణిదం గ్రామంలో మోటారు వాహనాల చట్టంపై బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ ముబారక్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలను మైనర్లకు ఇవ్వొద్దని కోరారు. పారా లీగల్ వలంటీర్లు షేక్ సుభాని, షేక్ ఖాజా వలి, పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



సత్తెనపల్లి: ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ..తల్లిదండ్రుల సహకారం లేని ప్రతిభావంతులైన విద్యార్థులను ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ మాజీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ దత్తత తీసుకొని, వారి పూర్తి ఫీజు దాతల సహకారంతో అందిస్తున్నారు. పట్టణానికి చెందిన షేక్ ఆయాజ్ అనే పదో తరగతి విద్యార్థి భవిష్య పాఠశాలలో విద్యనభ్య శిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో ఆయాజ్ స్కూల్ ఫీజు, ఇతర అవసరాలు మొత్తం తీరుస్తానని కొత్త రామకృష్ణ ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది 8 మంది విద్యార్థులను దత్తత తీసుకొని చదివిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థికి ఆర్థిక సాయం అందించిన వంశీ స్పెషలిటీ వైద్యశాల వైద్యురాలు డాక్టర్ షకీలా శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్య పాఠశాల కరస్పాండెంట్ ఐ.శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



క్రోసూరు: మండలంలో అన్ని గ్రామాల్లో పారిశుధ్యపనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పారిశుద్యపనులు ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా అగస్టు 10 వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. క్రోసూరు, ఆవులవారిపాలెం, దొడ్లేరు, పెరికపాడు తదితర గ్రామాల్లో పారిశుద్యపనులు బుధవారం ముమ్మరంగా జరిగాయని తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

జిల్లా ఎస్సీ,ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటిదాసు


భోజనం పరిశీలిస్తున్న గార్లపాటిదాసు

క్రోసూరు: పాఠశాలలో మధ్యాహ్న భోజనం తినడానికి బాగుండటం లేదని అనేక మంది విద్యార్థులు మానేయడం విచారకరమని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు దృష్టికి తీసుకెళ్తామని జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గార్లపాటిదాసు అన్నారు. క్రోసూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఆయన పలువురితో కలిసి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలు గుర్తించినట్లు చెప్పారు. పాఠశాలలో 540 మంది విద్యార్థులుంటే.. కేవలం 120 మంది మాత్రమే భోజనం చేస్తున్నారని తెలిపారు. దీనిపై హెచ్ఎం రామాంజనేయులు వివరణ కోరగా.. విద్యార్థులు ఎక్కువ శాతం ఇళ్ల నుంచి భోజనం తెచ్చుకుంటున్నారని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. తల్లిదండ్రులు మాత్రం భోజనం సరిగా వండటం లేదని చెప్పినట్లు వివరించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్ నుంచి తాగునీరు కూడా రావటం లేదని, అది చాలా రోజులుగా మరమ్మతులకు గురైనట్లుగా తెలిపారు. ఆరవ తరగతి విద్యార్థులు 16 మందికి ఇంత వరకు పాఠ్యపుస్తకాలు అందలేదని దాసు వివరించారు. ఉపాధ్యాయులు సురేష్, బాబురావు, రామాంజనేయులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

ఎంపీడీవో కుసుమకుమారి


గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధి హామీ పథకం సిబ్బంది

అచ్చంపేట: నీటిని వృథా చేయెద్దని, పొదుపుగా వాడుకోవాలని, వాడిన నీరు భూమిలోకి ఇంకిపోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీవో కుసుమ కుమారి సూచించారు. జలశక్తి అభియాన్, నారీ సే జలశక్తి కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది బుధవారం అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడారు. భూగర్భ జలాలను పొందించుకోవాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని వివరించారు. నీటిని పొదుపుగా వాడుకుంటామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. ఎంపీపీ నరసింహారెడ్డి, ఏపీఎం నాగ శ్రీనివాస్, వెలుగు ఏపీఓ సలీమ్, యానిమేటర్స్, డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

తల్లి ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకా


తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో డాక్టర్ మహ్మద్ షాద్, సిబ్బంది

క్రోసూరు: తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని , బిడ్డకు జన్మించిన గంటలోపు తల్లిపాలు అందించాలని క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మహ్మద్‌షాద్ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలు గురువారం నుంచి 7వ తేదీ వరకు ప్రారంభం కానున్న సందర్భంగా బుధవారం తల్లిపాల ఆవశ్యకతపై క్రోసూరులో ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ జన్మించిన మొదటి గంటలోనే అందించే తల్లిపాలు బిడ్డకు జీవ రక్షక బిందువులని, పసుపు రంగులోని చిక్కటి పాలు (ముర్రు పాలు) అమృతం లాంటివన్నారు. వాటితో బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని, బిడ్డను అనేక రోగాల నుంచి సురక్షితంగా ఉంచుతుందన్నారు. తల్లిపాల ఆవశ్యకత గురించి వైద్య సిబ్బంది గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, హెల్త్ సూపర్వైజర్ ప్రభావతి, స్టాఫ్ నర్స్ రాణీ, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి


మొక్కను నాటుతున్న జాంబియా దేశస్థులు

వెల్దుర్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి మల్లుస్వామి అన్నారు. బుధవారం మండలంలోని గుడిపాటి చెరువులో జాంబియా దేశానికి చెందిన పీహెచ్‌డీ విద్యార్థులు కెబా, జోనల్, కెమో ఆధ్వర్యంలో 70 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ మామిడి, బత్తాయి పండ్ల మొక్కలు నాటడం జరిగిందన్నారు. మాతా అమృతానందమయి యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుడిపాటి చెరువులో పరిశోధనలు చేసేందుకు వచ్చిన విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. ఈ మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత గృహ యజమానులదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాతా అమృతానందమయి ప్రతినిధి మల్లికార్జున, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


కప్ అందజేస్తున్న హెచ్ఎం విజయరాణి

సత్తెనపల్లి: జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తెనపల్లిలోని హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ అండర్ -15 టోర్నమెంట్ గుంటూరు బృందావన్ గార్డెన్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 26న నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 10 పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. హోలీ ఫ్యామిలీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 9, 10వ తరగతి క్రీడాకారులు జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారు. క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ విజయరాణి బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్య క్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.అచ్చిరెడ్డి, రాజా, క్రీడాకారులు తది తరులు ఉన్నారు.